క్లుప్తంగా

వైభవంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామాలయంలో బుధవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కుంకుమార్చనకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరుబావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇచ్చోడ: మండలంలోని తాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. బుధవారం మండలంలోని హరినాయక్ తండా, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటించారు. మిషన్ భగీరథ నీటితో పాటు గ్రామాల్లో ఉన్న బోరు బావుల ద్వారా నీటిని వాడుకోవాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య లేదన్నారు.

నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న దత్తు

తాంసి: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆదిలాబాద్ నిరుద్యోగ కళాకారుల సంఘం సభ్యుడు పల్లకొండ దత్తు కోరారు. బుధవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో నిరుద్యోగ కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. సమావేశంలో సభ్యులు విలాస్, దత్తు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సొనాల మండలం ఘనపూర్‌కు చెందిన కృష్ణ మహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని వాగ్దారి గ్రామంలోని జగదాంబ దేవి ఆలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మద్యం, మాంసానికి యువత బానిస కావద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి నిత్యం గ్రామంలోని ఆలయాలను దర్శించుకొని పూజలు చేయడంతో కుటుంబాల్లో సుఖసంతోషాలు నెలకొంటాయన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జాధవ్ కృష్ణ, ఆలయ పూజారి రామారావు, రోహిదాస్, భక్తులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



శబరిమాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని బుద్ధికొండ శివారులో గల శబరిమాత ఆశ్రమాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం సందర్శించారు. ఆంజనేయ స్వాముల కోరిక మేరకు ఆశ్రమం వద్ద మిషన్ భగీరథ నీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా అంజనేయ స్వాములు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు తరలిరావాలి



మాట్లాడుతున్న ప్రణవ్ ఆనంద ప్రభుజీ

ఆదిలాబాద్: ఇస్కాన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తులు భారీగా తరలిరావాలని ప్రముఖ ఆ ధ్యాత్మికవేత్త శ్రీమాన్ ప్రణామానంద ప్రభుజీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మధుర జిన్నింగులో బుధవారం మాట్లాడారు. ఈనెల 4 నుంచి 6 వరకు శ్రీరామనవమి వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అభిషేకం, పల్లకి ఉత్సవం, శ్రీ సీతా రామచంద్ర స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

నిరుపయోగంగా నీటితొట్టీలు



నీరు లేక నిరుపయోగంగా నీటి తొట్టి

- తాగునీటి కోసం అల్లాడుతున్న పశువులు
- వృథాగా ప్రజాధనం
- పట్టించుకోని జీపీ సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: రోజురోజుకు ఎండలు మండిపోవడంతో గ్రామాల్లోని వాగులు, చెరువులు అడుగంటుతున్నాయి. దీంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. అయితే ప్రభుత్వాలు ఆయా గ్రామాల్లో, శివారు ప్రాంతాల్లో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పథకంలో భాగంగా నీటి తొట్టీలను నిర్మించారు. వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా.. నీటి తొట్టీలు నిరుపయోగంగా మారాయి.

ఖాళీగా దర్శనం..

గతంలో ఏన్నాడూ లేని విధంగా ఈ ఏడాది మార్చి చివరి వారంలోనే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉంది. పశువుల దాహార్తిని తీర్చేందుకు పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో గతంలో నిర్మించిన పశువుల నీటి తొట్టీల్లో నీళ్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లోని నీటి తొట్టీలు కూలిపోయాయి.

48 నీటి తొట్టీల నిర్మాణం..

ప్రభుత్వాలు 2013 సంవత్సరంలో గ్రామాల్లో పశువుల నీటి తొట్టీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తొట్టి నిర్మాణానికి రూ. 19,427 వ్యయంతో ఖర్చు చేయగా 5 మీటర్ల పొడువు, 2 మీటర్ల వెడల్పు, 60 సెం.మీ (2 ఫీట్లు) ఎత్తుతో నిర్మించారు. అనంతరం 2016లో ఆ వ్యయాన్ని రూ. 21,771కి పెంచింది. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా 62 నీటి తొట్టీలు మంజూరు కాగా ఇందులో సుమారు 48 పశువుల నీటి తొట్టీల నిర్మాణాలు చేపట్టారు.

జీపీలదే నిర్వహణ బాధ్యత..

నీటి తొట్టిల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలు చూసుకోవాలి. నాచు పేరుకుపోతే వాటిని బ్లీచింగ్ పౌడర్‌తో క్లీన్ చేసి నీటిని నింపాలి. క్లీన్ చేయడం వేరు కానీ కనీసం అందులో నీటిని కూడా నింపడం లేదు. దీంతో వాటి ఉపయోగం లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని పశుపోషకులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశువుల నీటి తొట్టిలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీరోజు నీటిని నింపాలి

నీటి తొట్టీల నిర్మాణం వరకే తమ పరిధి. ప్రస్తుతం కొత్త నీటి తొట్టీల నిర్మాణాలు చేపట్టడం లేదు. గ్రామాలలో పశువుల దాహార్తి తీర్చేందుకు గతంలో నిర్మించిన తొట్టీల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. ప్రతీరోజు వారే అందులో నీటిని నింపడంతో పాటు క్లీన్‌గా ఉంచుకోవాలి.

– నరేందర్, ఈసీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్

సమస్యలు పరిష్కరించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేట గ్రామంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వాహనాల విడుదలపై సమాధానం ఇవ్వాలి'



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ బ్రహ్మానంద్

నేరడిగొండ: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను పోలీసులు ఎందుకు వదిలిపెట్టారో సమాధానం ఇవ్వాలని గుడిహత్నూర్ మాజీ జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద హిందూ సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 27న ఉదయం అక్రమంగా పశువులను తరలిస్తున్నారని హిందూ సంఘాల నాయకులకు సమాచారం అందడంతో ఎస్సైకు సమాచారం ఇచ్చారు. వారు స్పందించకపోవడంతో మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసుల సహాయంతో నాలుగు ఐచర్, మూడు బొలెరో వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వాహనాలను ఏ చట్టం ప్రకారం విడిచిపెట్టారో ఇచ్చోడ సీఐ, నేరడిగొండ ఎస్సైలు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే హిందూ యువకులపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్, బంజరంగ్ దళ్, హిందూ వాహిని, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మారుమూల గ్రామాలు ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ యార్డుకు 30 కిలోమీటర్లు, బోథ్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు 40 కిలోమీటర్ల దూరం ఉండడంతో జొన్న పంటలను విక్రయించడం కష్టంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, మాజీ జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, పీఏసీ డైరెక్టర్లు చట్ల వినిల్, నారడి లింగన్న, రైతులు దుబ్బుల చంద్రశేఖర్, నాగభూషణ్, దీసీ రమేశ్, లక్కం శంకర్, రవి, చట్ల విలాస్ పాల్గొన్నారు.

'యువ వికాసం'పై అవగాహన కల్పించాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో రవీందర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న హెల్ప్‌డెస్క్ సిబ్బంది

ఇంద్రవెల్లి: యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఆన్‌లైన్ ద్వారా నమోదైన దరఖాస్తుల వివరాలు అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు అందించాలని సూచించారు. ఆదే విధంగా మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు, కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ కోసం హెల్ప్‌డెస్క్ ప్రారంభించారు. కార్యాలయ పనివేళలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. దరఖాస్తు ఫారంలను ఇక్కడే అందించి వాటిని పూర్తి చేసి స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు హెల్ప్‌డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన అరుణ్‌కుమార్



మంత్రిని సన్మానిస్తున్న అరుణ్

కైలాస్‌నగర్: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుల అరుణ్ కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన పౌరవిమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలిపినట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించినట్లుగా ఆయన తెలిపారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, మంత్రి, కేంద్ర మంత్రి రాంమోహన్‌నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. హర్యాన రాష్ట్ర భాషా, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. చిత్రలేఖనం, డ్రామ పోటీలతో పాటు విద్యార్థుల నృత్యం ఆకట్టుకుంది. పాఠశాల హెచ్ఎం శశికల మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: జిల్లాలోని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ రాజర్షి షా బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలన్నారు. అధ్యాపకుల సేవలను, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఆదిలాబాద్, ఉట్నూర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంగీత, ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

తలమడుగు: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బియ్యంను స్వయంగా తూకం వేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే సన్నబియ్యం

బేల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసమే సన్న బియ్యం ప్రారంభించిందని, మండల ప్రత్యేకాధికారి మనోహర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డీఆర్‌డిపోలో మండల ప్రత్యేకాధికారి, మండలంలోని దహెగాం గ్రామంలోని చౌకధరల దుకాణంలో జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సవాపురే విలాస్, మండల తహసీల్దార్ రఘునాథ్‌రావుతో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఆర్ఐ అశోక్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, సామ రూపేష్‌రెడ్డి, వాంఖడే రూప్‌రావు, బోక్రే శంకర్, ఘణేశ్యాం, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో బుధవారం సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు మాజీ సర్పంచ్ అడవ్ మారుతి తెలిపారు. రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులు సన్న బియ్యాన్ని ఎక్కడ నుంచైన తీసుకోవచ్చన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న అధికారి

కార్యక్రమంలో రేషన్ డీలర్ నరాల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే ప్రతిపక్షాలు రాద్ధాంతం

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడాన్ని ప్రతిపక్షాలు ఓర్వలేక రాద్ధాంతం చేస్తున్నాయని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పట్నాపూర్, పొచ్చెర, కౌఠ(బి) గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పసుల చంటి, గొర్ల రాజు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, రాజశేఖర్ రెడ్డి, రహీమొద్దీన్, సుభేష్ రెడ్డి, అబూద్, తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు



సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న చైర్మన్

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మర్యాద పూర్వకంగా కలిసిన జేఏసీ ప్రతినిధులు, శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి గొప్ప గొప్ప అవార్డులు మరిన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా ఇన్‌చార్జి మోతే భారిక్ రావు, మల్యాల మనోజ్ కుమార్, నక్క రాందాస్, కత్తి గంగాధర్, జెల్ల మహేందర్ పాల్గొన్నారు.

ఎండిపోతున్న మొక్కలు



గౌరపూర్ ప్రకృతివనంలో ఎండిన చెట్లు

హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంద్రవెల్లి మండలంలోని గౌరపూర్, రుప్‌సింగ్‌తండా సమీపంలో లక్షలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వందలాది మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మొక్కలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి



రుప్‌సింగ్‌తండాలో..

ఇన్‌చార్జి ఎంపీడీవోగా జీవన్‌రెడ్డి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో భాస్కర్ రెండు నెలలు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా ఎంపీడీవోగా జీవన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: వేసవిలో జాగ్రత్తలు పాటించాలని నేరడిగొండ పీహెచ్‌సీ హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని గుత్పాల గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండ వేడిమి నుంచి కాపాడుకునేలా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ద్వారా ఇప్పటికే అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎస్ఎం కల్పన, అంగన్‌వాడీ కార్యకర్త తిరుపతమ్మ, ఆశ కార్యకర్త గంగామణి పాల్గొన్నారు.